## సెప్టెంబర్ 1న చలో హైద్రాబాద్

**కంది, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సిపిఎస్‌ను రద్దు చేసి ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తారీఖున హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద యుఎస్‌పిసి ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు యుఎస్‌పిసి జిల్లా నాయకులు బి సాయిలు, పి శ్రీనివాస్‌రావులు అన్నారు. మహాధర్నాను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న జీబు యాత్ర సోమవారం మండల కేంద్రమైన కంది, మండలంలోని మామిడిపల్లి గ్రామాల్లోని పాఠశాలలకు చేరుకుంది. ఈ సందర్భంగా సాయిలు, శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ సిసిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పిఆర్సీ కమిటీ వేసి జులై 1వ తారీఖు నుంచి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను ఎప్పటికి అప్పుడు విడుదల చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తదితర డిమాండ్‌ల సాధన కోసం నిర్వహిస్తున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. యుఎస్‌పిసి నాయకులు ఆర్ సంహాచలం, ఎం విజయానంద్, కే శంకర్, జగన్ మోహన్, ఎన్ నారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## అర్హులకు దళితబంధు ఇవ్వాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** రాజకీయాలకతీతంగా అర్హులైనవారికి దళితబంధు ఇవ్వాలని కులవివక్ష పోరాట సంఘం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరన అన్నారు. సోమవారం పెద్దశంకరం పేటలోని మహాత్మాగాంధీ విగ్రహం నుండి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ అధికారులకు అందించారు. మండ లంలో దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే అందాఇస్తున్నారని విమర్శిం చారు. అధికారులు సర్వేచేసి అర్హులైన వారికి దళితబంధు, డబుల్ బెడ్‌రూం, గృహలక్ష్మి తదితర పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల బాధ్యులు భూమయ్య, లక్ష్మయ్య, ప్రభాకర్, శంకర్, రమేష్, సుభాష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు



ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

## ప్రతి బీడీ కార్మికులకు జీవన భృతి కల్పించాలి

**దబ్బాక, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** పిఎఫ్ నెంబర్ ఉన్న బీడీ కార్మికుల అందరికీ జీవన భృతి ఇవ్వాలి అని హిందూ మద్దూర్ సభ సిద్దిపేట సంఘం డిమాండ్ చేశారు. దుబ్బాక మండల పరిధిలో గల అన్ని గ్రామాల నుండి దాదాపు 450 నుండి 500 వరకు బీడీ కార్మికులు పిఎఫ్ నెంబర్ ఉన్నప్పటికీ జీవన భృతి రాని కార్మికులు సోమవారం దుబ్బాక మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో భాస్కర శర్మ కి వినతి పత్రం మరియు జీవన భృతి అప్లికేషన్ ఫారంలు ఇవ్వడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం అద్యక్షులు ఇదారి మల్లేషం మాట్లాడుతూ దుబ్బాక మండల పరిధిలోని వివిధ గ్రామాలలో జీవన భృతి రాని కార్మికులందరికి ఎంపీడీవో కి ప్రత్యేక చొరువ తీసుకొని కార్మికులందరికి జీవన భృతి వచ్చే విధంగా కృషి చేయాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేయడం జరిగింది. అదే విధంగా సిద్దిపేట జిల్లా పరిధిలోని మిరుదొడ్డి, కొండాపాక, దౌల్తాబాద్, గజ్వేల్, నంగునురూ తదితర మండలాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆ తరువాత సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం ఉపాధ్మక్షులు మధు. జిల్లా కార్మదర్శి లక్ష్మణ్, మహిళ నాయకురాలు కౌసల్యా మీన, రేణుక లలిత కళ్యాణి, అర్చన, రవళి, సారిక శ్యామలత, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో బిజెపి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న బీదర్ బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ శైలేంద్ర బెలదలే

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే ప్రవస్ యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని రంజోల్‌లోని పెట్రోల్ బంక్ నుంచి జాతీయ రహదారిపై గల శివాజీ మహారాజ్ విగ్రహం వరకు భారతీయ జనతా పార్టీ నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కర్ణాటకలోని బీదర్ సౌత్ బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ శైలేంద్ర బెలదలే మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రానున్న ఎన్నికల్లో విజయతీరంకు చేరుకునేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను ప్రతి గడపలో ప్రచారం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలను తాగుబోతుల్లాగా మార్చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త కొత్త పథకాలను ప్రకటిస్తూ ప్రజలను మభ్యపట్టేయత్నం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచందర్ రాజనర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, జిల్లా అధికార ప్రతినిధి చింతల్ ఘట్ సుధీర్‌కుమార్, అసెంబ్లి కన్వీనర్ కె జనార్ధన్‌రెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధీర్ బండారి, నాయకులు మల్లికార్జున్ పాటిల్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కిసాన్ సెల్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ పాటిల్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు వీరారెడ్డి, ఎన్‌నాథ్‌పాటిల్, ఓబిసి మోర్చా అసెంబ్లి కన్వీనర్ సురేష్ పూరి, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, నాయకులు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథం, జయకృష్ణ, పురుషోత్తం, శ్రీనివాస్, సంతోష్, కళాకారు, ప్రశాంత్‌రెడ్డి, సాయి, సంపత్ తదతరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలి

**-జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి**



మాట్లాడుతున్న రాజిరెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు28 ప్రభాతవార్త:** అక్టోబర్ చివరి వారంలో నిర్వహించే జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేటట్లు చూడాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ గైడ్ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ప్రధాన అంశం ఆరోగ్యం మరియు సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం దీనికి అనుబంధంగా ఐదు ఉప అంశాలు 1. మీ పర్యావరణ వ్యవస్థ గురించి తెలుసుకో 2. ఆరోగ్యం, పోషణ మరియు సంక్షేమం పెంపొందించడం 3. పర్యావరణ వ్యవస్థ మరియు ఆరోగ్యం కోసం సామాజిక మరియు సాంస్కృతిక పద్ధతులు 4. స్వీయి విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం 5. పర్యావరణ వ్యవస్థ మరియా ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ ఈ ఉప అంశాలకు అనుగుణంగా విద్యార్థులు నాణ్యమైన ప్రాజెక్టులను రూపొందించేలా ప్రోత్సహించాలని సైన్స్ ఉపాధ్యా యులను కోరారు. జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు గ్రూప్ లీడర్‌తో పాటు గైడ్ టీచర్లు పాల్గొనాలని వారు తెలియజేశారు. ఉత్తమమైన నాలుగు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రభు, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ రూరల్, ఆగస్టు28 ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం మెదక్‌లోని నూతన కలెక్టరేట్ భవనంలో మొట్టమొదటి ప్రజావాణిలో ఆయన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌వో పద్మశ్రీలతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఫిర్యాదిదారుల నుండి 73 దరఖాస్తులు అందగా అందులో పెన్షన్ గురించి 5, హౌసింగ్ గురించి 10, ధరణి ఫిర్యాదులు 41, వివిధ శాఖలకు సంబంధించిన 17 ఫిర్యాదులు అందాయి. మెదక్ మండల పరిధిలోని పాతూరు గ్రామంలో బూర్ల గోపాల్, రమేష్‌లకు చెందిన ఇళ్లు మెదక్-ఎల్కతుర్తి రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇళ్లు పాక్షికంగా కూలిపోగా ఇంటి ప్రక్కన ఉన్న తోట భిక్షపతి తమ ఇళ్లను పూర్తిగా రాత్రికి రాత్రే కూల్చివేసి తమ ఇళ్ల స్థలాన్ని కలుపుకొని ఫెన్సింగ్ వైర్‌తో కబ్జా చేశారని, అదేంటని అడిగితే చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. అలాగే వివిధ రకాల పెన్షన్లకు అర్హుల మైనప్పటికీ పెన్షన్లు అందలేదని, ధరణికి సంబంధించిన తపులు, పొరపాట్ల గురించి సర్దుబాటు చేయాలని మరికొన్ని ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబధించి తమకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలని ఫిర్యాదిదారులు అధిక సంఖ్యలో వచ్చి నూతన కలెక్టరేట్ భవనంలో కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో శైలేష్, డీఈవో గోవింద్, డీఎస్‌వో బ్రహ్మారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

### సిద్దిపేటలో..

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాల్సిన అవసరం ప్రతి అధికారిపై ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావా ణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అయన మా ట్లాడారు. ప్రజావాణి దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్

## శాసన సభకు పంపండి.. అభివృద్ధికి పాటుపడతా

**-కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్**

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రానున్న శాసన సభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం ఉంచి శాసన సభ తలుపులు తట్టేలా మద్దతు పలికితే జహీరాబాద్‌ను మరింత అభివృద్ధి చెందేలా తన వంతు సహకారం అందిస్తానని మాజీ మంత్రి, జహీరాబాద్ శాసన సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఏ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని రాజినెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వికారాబాద్ శాసన సభ స్థానం నుంచి 5 మార్లు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా ప్రజలకు సేవలు అందించినట్లు గుర్తు చేశారు. మాజీ మంత్రి, జహీరాబాద్ శాసన సభ ఇంచార్జి డాక్టర్ గీతారెడ్డి సూచనల మేరకు జహీరాబాద్ నుంచి పోటీ చేసేందుకు సై అన్నట్లు పేర్కొన్నారు. చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి చక్కర కర్మాగారాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటానన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డిని రాజ్యసభకు పంపేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు ప్రకటించారు. అక్రిడేషన్‌లు కల్గిన జర్నలిస్టులకు తన సొంత డబ్బులతో నియోజకవర్గంలో ఇండ్ల స్థలాలను అందచేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, మాధవి దేవదాస్, కోహీర్, జహీరాబాద్ జడ్పీటిసి సభ్యులు రాందాస్, నాగిశెట్టి రాథోడ్, కోహీర్, న్యాల్‌కల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మక్సూద్, నర్సింహారెడ్డి, ఎండి ఖాజా, మల్లికార్జున్‌రెడ్డి, నరేష్‌గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందని ధీమా..!

**సిఎం కెసిఆర్ పై పూర్తి విశ్వాసం ఉంది**
**టికెట్ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదు**
**ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితదరులు

**నర్సాపూర్, అగస్టు 28, ప్రభాతవార్త:** తనకు రాజకీయ బిక్ష పెట్టింది సిఎం కెసిఆరేననిరానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున నర్సాపూర్‌లో ఎమ్మెల్యేగా పోటి చేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ తనకు టికెట్ ఇస్తాడన్నా ఆత్మ విశ్వాసం ఉందని నర్సాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణా గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ ముఖ్య కార్యక్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ ముఖ్య కార్యకర్తల సమావేశంలోపాల్గొన్న ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 నియోజకవర్గాలుండగా బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అధిష్టానం 9 నియోజకవర్గా లకు అభ్యర్థులను కేటాయించగా కేవలం నర్సాపూర్ నియోజకవర్గాన్ని పెండింగ్ లో పెట్టడం బాధాకరంగా ఉందన్నారు. తనకు రాజకీయ బిక్ష పెట్టింది ముఖ్యమంత్రి కెసిఆర్ అని తనకు ఖచ్చితంగా న్యాయం చేస్తాడన్నా నమ్మకం ఉందన్నారు. నర్సాపూర్ టికెట్ ను ఆశిస్తున్న రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి కి ఎమ్మెల్సీ ఇచ్చి డిప్యూటీ సిఎం పదవీ ఇచ్చినా, మంత్రి పదవి ఇచ్చినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. తనకు మాత్రం టిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ అవకాశం ఇవ్వాలన్నారు. నర్సాపూర్ టికెట్ విషయంలో తాను వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గంలో తాను రెండు సార్లు ఎమ్మెల్యే ఉన్న 9 సంవత్సరాల కాలంలో ఎటువంటి అరాచకాలు అల్లర్లు జరుగలేదని నియోజవర్గర మొత్తం ప్రశాంతమైన వాతావరణంతో పాటు ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు ఈ మేరకు నర్సాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ రెండు ముక్కలుగా కాకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ చూడాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. అంతకు ముందు గుమ్మడిదల టోల్ గేట్ నుండిఎమ్మెల్యే మదన్‌రెడ్డి అధ్వర్యంలో బారీ ఎత్తున వందల కార్ల కాన్వాయ్‌తో నర్సాపూర్ మీదుగా ర్యాలీగా బయిలు దేరి చాకరి మెట్ల ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నర్సాపూర్ లోని సాయికృష్ణ గార్డెన్ లో జరిగిన విలేకరుల సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వేల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాయాల చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, శివ్వంపేట ఎంపిపి కల్లూరి హరికృష్ణ, హత్నూర ఎంపిపి నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు అశోక్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్‌లు రాజుయాదవ్, వెంట్రామ్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్ర శేఖర్, శివ్వంపేట రమణగౌడ్, నాయకులు, కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు.



గొర్రెల యూనిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## కుల వృత్తులకు జీవం పోసింది కేసీఆర్‌రే

**ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని, కుల వృత్తులకు జీవం పోసింది కేసీఆర్ సర్కారే అని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి శాలిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన పనులను ఆమె ప్రారంభించారు. మండలానికి చెందిన 350 మంది యువకులకు ఎల్ఎల్ఆర్‌ల పత్రాన్ని అందించారు. శాలిపేటలో రామాయపల్లికి చెందిన 71 యూనిట్ల గొర్రెలను పంపిణి చేశారు. రూ.5లక్షల రుపాయలతో గ్రామంలోనిర్మిం చనున్న గణేష్ మండపం భవనంకు భూమిపూజ, రూ. 10లక్షల రుపాయలతో నిర్మించిన మహిళ సంఘం భవనాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యా ణలక్ష్మి చెక్కులను అందించారు. అలాగే మడూర్‌లో ముదిరాజ్ సంఘం భవనానికి భూమిపూజ పనులను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరవై ఎండ్లలో చేయని అభివృద్ధి కేవలం 9 సంవత్సరాలలోనే చేశామన్నారు. ఇల్లు కట్టుకునే వారికి గృహలక్ష్మీ, ఆసరా పెన్షన్లు, దళిత బంధు, రైతు బంధు, రైతు భీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిం దన్నారు. ఇప్పుడు రుణమాఫీ కూడ చేస్తున్నామన్నారు. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**మెదక్ రూరల్, ఆగస్టు28 ప్రభాతవార్త:** మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని అన్ని చెరువుల్లో ఉచితంగా చేపపిల్లల పంపిణీ జరుగుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొంటూరు చెరువులో వంద శాతం సబ్సిడీపై 1,84,500 చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల వృత్తుల పట్ల బాధ్యతగా ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు. ప్రతి ఏడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చెరువుల్లో ఉచిత చేపపిల్లల పంపిణీ, వాటి మార్కెట్ కొరకు మత్స్యకారులకు వాహనాలను సమకూర్చడం, వాటిని హైదరాబాద్‌కు తరలించడానికి ఆటోలను సబ్సిడీపై ఇవ్వడం, అన్ని గ్రామాల సహకార సొసైటీ సంఘాల ఏర్పాటు ద్వారా వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేటట్టు చేయడం జరుగుతుందన్నారు. మెదక్ జిల్లాలో చెరువులు అన్ని నిండి ఉండటం వల్ల అన్ని చెరువుల్లో చేప పిల్లలను వదిలి నీలి విప్లవం తేవాలనేది ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక త్రాగునీరు, సాగునీరు సమస్యలను తీర్చడంతో పాటు అనేక బృహత్తర కార్యక్రమాలు ఈ ప్రభుత్వం ద్వారా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని, వైస్ ఎంపీపీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, తహశీల్దార్ శ్రీనివాస్, తెరాస నాయకులు రవి, సిద్ధాగౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

## విద్యార్థులకు సొంత నిధులతో ఉచిత బస్‌పాస్‌లు



భారతీ నగర్‌లో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** నియోజ కవర్గంలోని రామచంద్రాపురం, భారతీ నగర్ డివిజన్ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఉచిత బస్ పాస్‌లను పంపిణి చేశారు. సోమవారం బిహెచ్ఈఎల్ టౌన్ షిప్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకుంటున్న 480 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందన్నారు. గురుకుల విద్యాలయంలో విద్యను అందుకున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి 1ల 20వేల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు గుర్తు చేశారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్‌లో 60లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కాలనీలో గత 10 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న 33 కెవి లైన్ తలరింపు పనులను ప్రారంభించామన్నారు. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐసి సొసైటీ కార్యలయం ఆవరణలో 18లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని కార్పోరేటర్‌తో కలిసి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే వివరించారు. టౌన్‌షిప్‌లో గల శ్రీ అభిలాష ఒకేషనల్ సెంటర్‌ను సందర్శించినట్లు, శిక్షణ పొందుతున్న వికాలాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు హామి చేశామన్నారు. విద్యా భారతి పాఠశాల వార్షికోత్సవంలో శాసన మండలి మాజీ చైర్మన్ వి భూపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పోరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి, బూరుగడ్డ పుష్పనగేష్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, విద్యుత్ శాఖ డిఈ రమేష్ చంద్ర, బిఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైనవారికి పదోన్నతులు కల్పించాలి : పోచయ్య

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. సోమవారం చిన్న శంకరంపేటలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్న తులు కల్పించాలని, పారదర్శకంగా బదలిలను చేపట్టాలని, ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి జహిరోద్దిన్, మండల అధ్యక్షుడు గోపాల్, సత్యనారాయణ, రతన్, నాగ రాజు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి పోచయ్య



పురస్కారం అందుకుంటున్న నవీన్‌కుమార్

### ఉత్తమ సేవలకుగానూ నవీన్‌కుమార్‌కు అవార్డు అందజేత

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వాసవీ, ఆర్యవైశ్య మహాసభ, అలయన్స్ క్లబ్ అమర్‌నాథ్, కేదారినాథ్ అన్నదాన సేవా సమితిలతో పాటు పలు సేవా సంస్థల ద్వారా సేవలను అందిస్తున్న మాంకాల నవీన్ కుమార్‌కు ప్రతిభా బంగారు నంది అవార్డును అందించడం జరిగిందని శ్రీ మంజునాథ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంజులగౌడ్ అన్నారు. హైదారాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో మథర్ థెరిస్సా స్పూర్తితో నిర్వహిస్తున్న శ్రీమంజునాథ ఫౌండేషన్ ద్వారా ప్రతిభా బంగారు నంది అవార్డును నవీన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ నవీన్ సేవలను గుర్తించి 2023-24కు గానూ అవార్డు అందించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవార్డు గ్రహీత నవీన్‌కుమార్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డును అందజేసిన మంజునాథ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ శ్రీ సరస్వతీ ఉపాసకులు, సినీ నటులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## నమ్ముకున్న పార్టీకి ద్రోహం చేయొద్దు

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు**



మాట్లాడుతున్న అత్తు

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** నమ్ముకున్న పార్టీకి ద్రోహం చేసి ఇతర పార్టీలోకి వెళ్లడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు.జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్‌లో చేరినవారికే దిక్కులేదు, ఇప్పుడు చేరి ఏమి సాధిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల తరా ్వత ఆ పార్టీలో పట్టించుకునే నాథుడు ఉండదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరూ ఇతర పార్టీలకు వెళ్లొద్దని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని విడిచివెళ్లిన చాలరోజుల తర్వాత ఓ మైనార్టీ నాయకుడు కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. బిఆర్ఎస్‌లో చేరిన అ మైనార్టీ నాయకుడికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తప్పేట శంకర్, మధు, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గణేష్‌పల్లిలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సోమవారం జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ ఏఓ నాగేందర్‌రెడ్డితో కలిసి సందర్శించి కేంద్రంలోని పలు రికార్డులను, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా అక్కడక్కడ కురిసిన వర్షా లకు మొక్కజొన్న, పత్తి, వరి రైతులు పంటలపై తీసుకోవాల్సిన పలుజాగ్రత్తలపై సూచనలు చేశారు. కాంప్లెక్స్ మరియు పొటాష్ ఎరువులకన్నా తక్కువ ధరకే యూరియా లభ్యమవుతుందని, యూరియా వేసిన వెంటనే పైరు పచ్చగా కనిపిస్తుందన్నారు. దీంతో రైతులు అధిక మోతాదులో యూరియాను వాడేందుకు మొగ్గు చూపుతున్నారని, దీని అధిక ఖర్చు, చీడపీడల తాకిడి ఎక్కువ కావడం, వాటి నిర్మూలనకు పురుగు మందులను పిచికారి చేయడం వల్ల రైతు జేబుకు చిల్లుతప్ప ఎలాంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు. రైతులు పంట లకుకావాల్సిన మోతాదులోనే యూరియా, పురుగు మందులను వాడుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని తెలియజేశారు. ధాన్యపు పైర్లు విపరీతంగా పెరిగి బరువుతట్టుకోలేక మొక్క వంగిపోయి నేలకు పడిపోవడం, పూత ఆలస్యంగా వచ్చి పంటకాలం పొడిగించడం, తాలు గింజలు ఏర్పడడం వంటి నష్టాలు ఎక్కువగావచ్చే అవకాశం ఉంటుందన్నారు. మొక్క ఇతర పోషకాలను తీసుకోలేదని, తద్వారా పంట దిగుబడులు తగ్గుతాయని, రైతులు భాస్వ రం ఎరువులు వేయకుండా యూరియా పంటను బట్టి 25 నుండి 30 కిలోల పొటాష్ 10 నుండి 15 కిలోలు వేసుకోవాలని సూచించారు.

## గొల్లకురుమలకు అండగా సిఎం కెసిఆర్

**-ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



దౌలాపూర్‌లో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** రాష్ట్రంలోని గొల్లకురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు సిఎం కెసిఆర్ రాయితీపై గొర్రెలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లకురుమలు జీవనోపాధి పొందేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారీగా రాయితీపై గొర్రెలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదిలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి బాలేషంగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, బిఆర్ఎస్ నాయకులు యాదవరెడ్డి, వంటేరు శ్రీనివాస్‌రెడ్డి, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ నరేష్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లిన దుండగులు

**దబ్బాక, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో ఆదివారం రాత్రి సమయంలో హనుమాన్ దేవాలయంలో హుండీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారాన్ని అందించారు చోరీకి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వివరాలు సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

# రెండో ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్**



పాత బస్టాండు వద్ద రాసా ్తరోకో నిర్వహిస్తున్న

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రెండో ఎఎన్ఎంలు 13 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తు ంటే ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. సోమవారం రెండో ఎఎన్ఎంలు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసి అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు వద్ద రాస్తా్రోకో నిర్వహించారు. అనంతరం పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌నుంచి బిజెఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రెండో ఎఎన్ఎంలు 13 ఏళ్లగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాగానే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన సిఎం కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పుతున్నారని మండిపడ్డారు.రెండో ఎఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండో ఎఎన్ఎంల సమస్యల పట్ల ప్రభుత్వం ఏ మాత్రం చిన్నచూపు చూసిన ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్, ఎఎన్ఎంల నాయకులు బాలమణి, సరిత, వనజ,బాబామ్మ, బాలనర్సవ్వ, జాన్సీలక్ష్మీ, నాగలక్ష్మీ, భాగ్యలక్ష్మీ, హామీద, సునీత తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపిపి కొక్కుల కీర్తి సురేష్

### విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపిపి

**కోహేడ, ఆగస్టు 28, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపిపి కొక్కుల కీర్తి సురేష్ అన్నారు. కోహేడ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం(ఎస్‌జిఎఫ్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడాపోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రతి ఏటా గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడానికి మండలస్థాయి క్రీడా పోటీలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించడానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. మండలస్థాయిలో ఆడే క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తేవాలన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పావని, క్రీడాల ఇంచార్జి మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, వేణుకుమార్, ప్రిన్సిపల్, పిఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 30వ తేదీన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

**దబ్బాక, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాద్ సహకారంతో దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన శారీరక దివ్యాంగులకు ఈ నెల 30వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఎంపిడివో కార్యాలయంలో బ్యాటరితో నడిచే ట్రై సైకిల్ అందజేయుటకు జరుగుతుంది. అర్హతగల అభ్యర్థులు ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, వైకల్య ధృవీకరణ పత్రం, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలి. దుబ్బాక నియోజకవనకడ పరిధిలోని మండలాలకు చెందిన దివ్యాంగులు మాత్రమే హజరు కావాలని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.

### అపరిచిత వ్యక్తి ఫోన్ కాల్స్‌ను ప్రజలు నమ్మొద్దు

**మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్**

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కమిషనర్ పేరిట ఓ మాయగాడు మోసలకు పాల్పడుతున్నట్లు మున్సిపల్ కమీషనర్ అరిగేలా సంపత్‌కుమార్ తెలిపారు. ఇంటి, నీటి పన్ను, మున్సిపల్ లైసెన్స్ ఫీజులపేరిట 9391822851 ఫోన్ నంబరుతో సదరు వ్యక్తి ఫోన్‌చేసి డబ్బులు గూగుల్ పే ద్వారా చెల్లించాలని సూచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. గుర్తు తెలియన వ్యక్తి ద్వారా వచ్చే ఫోన్‌కాల్స్‌కు ప్రజలు స్పందించొద్ ్దన్నారు. వార్డులోని మున్సిపల్ అధికారులకు మాత్రమే నీటి, ఇంటి, లైసెన్స్ ఫీజులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు.

### గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**కొండపాక, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జగదేవపూర్ మండలానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఫ్యాషన్ డిజైనింగ్, సిజిటిలో మిగిలిపోయిన 31, బైపిసిలో 9 ఖాళీ సీటలను ఈనెల 29న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధికి భరోసానిచ్చే ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుం దన్నారు. జగదేవపూర్ మండలానికి చెందిన బాలికల గురుకుల కళాశాల కొండపాక మండల పరిధిలోని వేద ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుంది.

### 2కె రన్‌ను విజయవంతం చేయాలి

**కొల్చారం, ఆగస్టు 27 ప్రభాతవార్త:** నేడు(మంగళవారం) ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు 2 కెరన్ నిర్వహిస్తున్నట్లు మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు తునుకులపల్లి సంతోష్‌రావు తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. పురుషులు, మహిళా విభాగాల్లో తొలి మూడు స్థానాలకు బహుమతులు అందిస్తామని, క్రీడల వల్ల శారీరక మానసిక ఉత్సాహం కలుగుతుందని, మారుమూల ప్రాంతాల్లోని యువతకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించడానికి ఈ 2 కే రన్ నిర్వహిస్తున్నట్లు అన్నారు.

### దళితబంధు రాలేదని అధైర్యపడొద్దు

**బిఎస్‌పి అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రకాష్**

**టేక్మాల్, ఆగస్టు,28 ప్రభాతవార్త:** డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు రాలేదని ఎవరు అధైర్యపడొద్దని అందోల్ బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ ముప్పారం ప్రకాష్ అన్నారు. సోమవారం టేక్మాల్ మండలం సాలోజిపల్లి గ్రామానికి చెందిన బేగరి దేవయ్య రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తన పేరు కనీస పరిశీలనలో లేకపోగా దళితబంధు రాలేదని ఆత్మహత్యయత్నం చేసుకున్న విషయం తెల్సిందన్నారు. కాగా బేగరి దేవయ్యను బిఎస్‌పి బృందంతో కలిసి ముప్పారం ప్రకాష్ పరామార్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకు తిరుగుతూ బహుజన పార్టీ ప్రాధాన్యతను వివరించి చెప్పారు. రానున్నది బహుజన సమాజ్ పార్టీయేనన్నారు. ఆయన వెంట బిఎస్పీ సంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి ఈశ్వర్, అందోల్ అసెంబ్లీ నియోజక వర్గ అధ్యక్షులు పల్లేకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాపయ్య, టేక్మాల్ మండల అధ్యక్షులు సిద్దు, శ్రీనివాస్, కిరణ్ దయాకర్‌లున్నారు.

### బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్‌కు సన్మానం

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** ఇటీవల గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చిందం సుభాష్ బదిలీపై వెళ్లడంతో సోమవారం గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిందం సుభాష్‌ను శాలువాతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌లో చిందం సుభాష్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, సుభాష్ బదిలీ కావడం బాధాకరమైనప్పటికీ వృత్తిరీత్యా బదిలీలు తప్పవన్నారు. వారికి ఘనంగా వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఎస్ఐలు శంకర్, యాదగిరిరెడ్డి, అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం, ఐవిఎఫ్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్, నాయకులు చింత శ్రీను, అజార్, కొమురవెల్లి ప్రవీణ్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గడియారం స్వామిచారి, అహ్మద్, నర్సింలు, వినయ్‌రెడ్డి, వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చిందం సుభాష్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

### అభివృద్ధిని వ్యతిరేకించే శక్తులను తరిమికొట్టాలి : ఎమ్మెల్యే



కాంగ్రెస్, బీజేపీల నుంచి బిఆర్ఎస్‌లో చేరుతున్న దృశ్యం

**బెజ్జంకి, అగస్టు 28, ప్రభాతవార్త :** ప్రజాభివృద్ధిని వ్యతిరేకించే శక్తులను తరిమికొట్టాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని తలార్వానిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయా పార్టీలకు రాజీనామాలు చేసి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు.అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజక పాలన నడుస్తుందని ప్రతి ఒక్కరి సంక్షేమానికి సిఎం కెసిఆర్ కృతనిశ్చయంతో పని చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైపు అండగా నిలువడానికి ప్రతి ఒక్కరూ సిద్దంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, చింతలపల్లి సంజీవరెడ్డి, రావుల మొండయ్య, పెంటమీది శ్రీనివాస్, నరేష్, ఎల శేఖర్‌బాబు, బోనగిరి శ్రీనివాస్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### చిట్టాపూర్ గ్రామంలో ఎపి గ్రామీణ వికాస్ బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

**దబ్బాక, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను రీజినల్ మేనేజర్ ఆశ లత, యువజన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాన్నారు. గ్రామీణ ప్రాతంలో పెదలకు ఆర్థిక అభివృద్ధికి ఎపిజివిబి బ్యాంక్ తోడ్పడుతుందాన్నారు. కార్యక్రమంలో చిట్టాపూర్ బ్యాంక్ మేనేజర్ రంజిత్‌కుమార్, అనిల్‌కుమార్, ప్రకాశ్, శ్రావణ్‌కుమార్, బుర్రల ప్రసాద్, బ్యాంక్ మిత్ర సిబ్బంది, వెలుగు సిఎలు, మెమ్మా ఆర్పాలు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు ర్యాకం శ్రీరాములు, పెంటి కిషన్, నవత్, నగేష్, సాయి కిరణ్, జంగి కిషోర్, సతీస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### ముదిరాజులను గౌరవించిన పార్టీలకే మద్దతు

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి**



బందారంలో ముదిరాజుల సమావేశం నిర్వహించిన దృశ్యం

**కొండపాక, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ముదిరిజులకు రాజకీయాల్లో అవకాశం కలి ్పంచిన పార్టీకే మద్దతు ఉంటుందని ముదిరాజు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం బందారంలో సంఘం మండల అధ్యక్షుడు జిర్ర రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు తిగుళ్ల సత్యంతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఐదు రోజుల క్రితం బిఆర్ఎస్ పార్టీ ప్రకటించిన 115 అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటీ ముదిరాజులకు కేటాయించకపోవడం బాధకరమన్నారు. తెలంగాణలో 60 లక్షల ముదిరాజుల జనాభా ఉన్న ముదిరాజులను చిన్న చూపు చూసిన బిఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ముదిరాజులకు ఎమ్మెల్యే, ఎంపి, నామినేటేడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించిన పార్టీలకే మద్దతు ఇస్తామని తెలిపారు. ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా చైతన్యవంతమై హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, నీల అంజయ్య, రాగులపర్శరాములు, మైలారం శ్రీనివాస్, పతర్ల కొండల్, చింతల యాదగిరి, దుదెడ భాను, జిర్ర నర్సింలు, నాగరాజు, ముదిరాజు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

**పెద్దశంకరంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వీరోజిపల్లి గ్రామానికి చెందిన ఆగంగౌడ్‌కు మాంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందించారు. ఆగంగౌడ్‌కు రూ. 59 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా పట్టణంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెళ్పటీసీ విజయరామరాజు, ఎంపీటీసీలు దత్తు, వీణ సుభాష్‌గౌడ్, ఆర్ఎన్. సంతోష్‌కుమార్, పున్నయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేష్ షెట్కార్

**పెద్దశంకరంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** మండలపరిధిలోని మల్కాపూర్ గ్రామంలోని 30 కుటుంబాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో హనుమంతు, దుర్గయ్య, తుకారంగౌడ్, దూదేకుల గౌస్, దూదేకుల షాదుల్, చాకలి అశోక్, చాకలి సాయిలు, శ్రీనివాస్, ఉప్పరి రాజు, దాసరి భూపాల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జైపాల్‌గౌడ్, మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమన్నగారి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

## అమరులను మరవలేం

**సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**

**సిద్దిపేట రూరల్, అగస్టు 28, ప్రభాతవార్త :** విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా 2000 ఆగస్టులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన బషీర్ బాగ్ పోరాటంలో అమరులైన వీరులను మరవలేమని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారంరెడ్డి భవన్‌లో సోమవారం బషీర్‌బాగ్ ఉద్యమ పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగం వృధా కాలేదని విద్యుత్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందంటే వారి త్యాగ ఫలితమేనని తెలిపారు. అనాటి విద్యుత్ పోరాట స్పూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద ్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అది రంగారెడ్డి, జేరిపోతుల జనార్ధన్, పిట్ల మల్లేశం, నాయకులు ఐలయ్య, కొర్తివాడ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులు యూరియా దొరకడంలేదని అధైర్యపడవద్దు : ఏవో

**జగదేవ్‌పూర్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** మండలంలోని ఏ ఒక్క రైతు యూరియా దొరకలేదని అధైర్యపడవద్దని మండలవ్యవసాయాధికారి వసంత రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలంలో ప్రతిరోజు 700 నుండి వెయ్యి బస్తాల వరకు యూరియా సరఫరా అవుతుందన్నారు. యూరియా దొరకడంలేదని కొందరు రైతులు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి ఇళ్లల్లో నిల్వ చేసుకుంటున్నారని, అలా చేయకుండా సరిపడా యూరియా మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఎకరానికి సగం బస్తా నుండి ఒక బస్తా మాత్రమే యూరియా సరిపోతుందని, అధిక మోతాదులో యూరియా వాడితే పంటకు తెగుళ్ల, పురుగుల ఉధృతి పెరిగి పంట నష్టం జరిగి దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే ఎరువులు వాడి అధిక లాభాలు పొందాలని సూచించారు. కాగా మంగళవారం జగదేవ్‌పూర్‌లో 500 బస్తాలు, మునిగడపలో వెయ్యి బస్తాల యూరియా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

**-పిఆర్‌టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, కుమార్**



పిఆర్‌టియు సభ్యత్వాన్ని అందజేస్తున్న మండల నాయకులు

**మర్కుక్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిఆర్‌టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, కుమార్ కోరారు. సోమవారం పాములపర్తి, మర్కుక్, దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పాతూరు, ఎర్రవల్లి, యూసుఫ్‌ఖాన్‌పల్లి, వర్ధరాజ్‌పూర్, శివారువెంకటాపూర్, ఇప్పలగూడెం, భవానందపూర్ కెజిబివి, చేబర్తి తదితర పాఠశాలల్లో పిఆర్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ పూర్తిస్థాయి ఖాళీలతో 13500 పోస్టులు నూతన డిఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, పిఆర్‌సి కమిటీ ఏర్పాటుచేసి ఐఆర్ ప్రకటించాలని, 2003 డిఎస్సీకి పాత పెన్షన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే 2004 తర్వాత అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరికీ సిపిఎస్ రద్దుచేసి కెజిబివిలకు రెగ్యులర్ పే స్కేల్ అమలు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నీరుడి లక్ష్మినారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబొద్దీర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసచారి, నాయకులు శ్రీధర్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దిలీప్, ముత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

**బెజ్జంకి, అగస్టు 28, ప్రభాతవార్త :** మండలపరిధిలోని బేగంపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, ఎస్ఐ నరేందర్‌రెడ్డి విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్,బాల్య వివాహాల వలన ఎర్పడే పరిణామాలు, సోషల్ మీడియా ప్రభావం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఇబ్బందులకు గురి చేసిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100 లేదా షీటీమ్ వాట్సప్ 8712667434, స్నేహిత మహిళా సపోర్టు 9494639498, మహిళా పోలీసు స్టేషన్ 8712667435కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

**బెజ్జంకి, అగస్టు 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత చిలువేరు శ్రీనివాస్‌రెడ్డిని కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్షణం పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ మాజీ ఎంపి పొన్నాం ప్రభాకర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు రొడ్డ మల్లేశం, నాయకులు శీలం నర్సయ్య, గంగాధర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న అరిబొద్దీన్

**సిద్దిపేట రూరల్, అగస్టు 28, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణానికి చెందిన క్రికెటర్ మహమ్మద్ ఇస్తాకర్ కుమారుడు అరిబొద్దీన్ సోమవారం హైదారాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బిఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న అరిబొద్దీన్‌కు సిఎం కెసిఅర్ గులాబీ కండువాకప్పి పార్టీలోకి అహ్వానించారు. పార్టీలో తగిన ప్రాధాన్య కల్పిస్తామని చెప్పినట్లు అరిబొద్దీన్ పేర్కొన్నారు. పార్టీ పటిష్టతతో పాటు రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని అరిబొద్దీన్ తెలిపారు.



సిఎం సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న దృశ్యం



మల్లిలో వికలాంగులకు పెన్షన్లను అందజేస్తున్న సర్పంచ్ మరుతి

## మల్లిలో వికలాగులకు పెన్షన్ల పంపిణీ

**న్యాల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని మల్లి గ్రామంలో సోమవారం వికలాంగులకు గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు జెట్గొండ మారుతి పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం వికలాం గులకు 3016 రూపాయలు నుంచి 4016 రూపాయలకు పెన్షన్ ను పెంచిన విషయం విధితమే. పెరిగిన పెన్షన్లను గ్రామ సర్పంచ్ ఆధ్వ ర్యంలో పెన్షన్లను అందచేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శివా నంద శ్రీవతి, వార్డు సభ్యులు సిద్దారెడ్డి, బాలాజీ, పోస్ట్‌మ్యాన్ నర్సింలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రీడా పోటీలు



జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

**చౌటకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ మన ఇంటి భోజనం రెస్టారెంట్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా కొన సాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ఘనంగా ముగి సాయి. పోటీల్లో భాగంగా చెస్, క్యారమ్‌ల విజేతలుగా జేఎన్‌టియు సుల్తాన్ పూర్ ఇంజనీరింగ్ విద్యార్థులు, ఖో-ఖో పోటీలో ప్రథమ స్థానంలో జహీరాబాద్ స్ట్రాంగ్ బైస్ టీమ్, ద్వితీయ స్థానంలో శ్రీ సాయి బిందు సాగర్ బృందం నిలిచింది. క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెమొం టోలు, నగదు పురస్కారాలను సుల్తాన్‌పూర్ మన ఇంటి భోజనం రెస్టారెంట్ చైర్మన్ బిక్షపతి నవ్య రాకేష్‌రెడ్డి అందచేశారు. కార్యక్రమం లో జేఎన్‌టియు సుల్తాన్‌పూర్ ఫిజికల్ డైరెక్టర్ సునీల్ కుమార్ గౌడ్, భజరంగ్ దళ్ గోరక్ష ప్రముఖ్ ప్రభు కుమార్ గౌడ్, యూనివర్సిటీ విద్యా ర్థులు, జిల్లాలోని ఆయా మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**పుల్కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని సింగూర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంఈసి, సిఈసి, వొకేషనల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల కోసం మంగళవారం కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## 101వ రోజు దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



పాదయాత్ర నిర్వహిస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**దబ్బాక, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** మాయ మాటలు చెప్పె బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మాటలు నమ్మదని, కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముత్యరెడ్డి ఆశయ సాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలో తాళ్ళపల్లి గ్రామంలో దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర 101వ రోజున చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాదయాత్ర నిర్వహింస్తూ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు మొదటగా తీసుకు వచ్చిందే కాంగ్రెస్ పార్టీని గుర్తు చేశారు. అధికారం కోసం బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఎంతటికైన తెగిస్తారని, ప్రజల ఆవసరాలు కాదు వారికి పదవులే ముఖ్యమని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలతో పాటుగా 108, ఉచిత రేషన్ బియ్యం, పెంఛన్లు తీసుకు వచ్చిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ వచ్చె ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారి మేజార్టీతో గెలిపించాలను ప్రజలను కోరారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టేంట్ గోపరి స్వామి రోడ్డు ప్రమాదనికి గురైన విషయం తెలుసుకుని స్వామిని పరామర్శం చారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌పేటభూంపల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్య క్షుడు బాల్‌నర్స గౌడ్, ఉపాధ్యక్షుడు గజబింకర్ అశోక్, కార్యదర్శి కోనపురం బాలు, సీనియర్ నాయకుడు పాతూరి వెంకటస్వామి గౌడ్, యాదగిరి, బాలగౌడ్, నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## వస్తువుల నాణ్యతపై విద్యార్థులకు అవగాహన

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** బ్యూరో ఆఫ్ ఇండియల్ స్టాం డర్డ్స్ సహకారంతో ఐక్యూఏసి, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళా శాల (ఎ)లో వస్తువుల నాణ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ తసన్నీరు రాకేష్, గౌరవ అతిథిగా జిల్లా విశ్రాంత సైన్స్ అధికారి గాంధారి ప్రభాకర్‌లు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన వస్తువులను ఉపయోగిస్తే కల్తీ వస్తువులు కానరా కుండా పోతాయన్నారు. ఈ సందర్భంగా స్టాండర్డ్ రేటింగ్‌పై విద్యార్థులకు రాత పరీక్షను నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ బహు మతిగా 4వేలు, ద్వితీయ బహుమతిగా 3వేలు, తృతీయ బహుమతిగా 2వేలు, కన్సోలేషన్ బహుమతిగా 1వేయి రూపాయలను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్నప్రసాద్, కళాశాల ఐక్యూఏసి కన్వీనర్ విశ్వేశ్వర్ శర్మ, కళాశాల స్టాండర్డ్స్ క్లబ్ మెంటర్ డాక్టర్ ఎస్ ఉపేందర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్దులు, శివదీప్తి పాల్గొన్నారు.

### ఎడిషన్‌కోసం థ్రిల్లింగ్‌గా ఉన్న కార్టూన్ నెట్వర్క్ పోగో

వార్నర్ బ్రోస్ డిస్కవరీ పిల్లల బ్రాండ్లు కార్టూన్ నెట్వర్క్ పోగో భారత దేశంలో స్కూల్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ 16వ ఎడిష న్‌ను ఆవిష్కరించడానికి థ్రిల్లింగ్‌గా ఉన్నాయి. ఈ సందర్భంగా వార్నర్ బ్రోస్ డిస్కవరీస్ దక్షిణా సియా కిడ్స్ క్లస్టర్ హెడ్ ఉత్తమ్ పాల్‌సింగ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పిల్లలకోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్కూల్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ప్రారంభించడం తమకు సంతోషంగా ఉందన్నారు.

# రైతులకు మొదలైన యూరియా కష్టాలు

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):**

సిద్దిపేట జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 5 లక్షల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయి. ఇందులో వరి 3లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉండడంతో భూగర్భజలాలు పెరిగి సాగు గణనీయంగా పెరిగింది. నియోజకవర్గంలో రైతులు పంటను సాగు చేయడానికి సిద్ధం కావడంతో యూరియా కోసం తిప్పలు పడాల్సి వస్తుంది. మూడు రోజుల నుండి రైతులు యూరియా కోసం గజ్వేల్ మార్కెట్ యా ర్డులో ఎదిరి చూస్తున్నారు. గజ్వేల్‌తో పాటు చాలా ప్రాంతాల్లోని ప్రైవేట్ షాపుల్లో యూరియా నిల్వలు నిండుకున్నాయి. చాలా రోజుల తర్వాత వర్షం కురువ డంతో యూ రియా కోసం రైతులంతా ఫర్టిలైజర్ల వద్దకు పరుగులు తీశారు. అక్కడ స్టాక్ లేకపోవడంతో రైతులు యూరియా కోసం బారులు తీరారు. అప్పటి కప్పుడు అధికారులు 80 టన్నుల యూరియా తెప్పించి పంపిణీ చేశారు. రోజుకు 2200 టన్నుల యూరియాను సప్లయ్ చేస్తున్నారు. వారంరోజులుగా వ్యాగన్లు రాకపోవడం వల్ల 1300 మెట్రిక్‌టన్నులు మాత్రమే



గజ్వేల్ మార్కెట్‌యార్డులో బారులుతీరిన రైతులు

అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

### యూరియాకు కొరత లేదు : ఎడి

రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి కొరత లేదని ఏడి బాబునాయక్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌మార్కెట్ యార్డు లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ డివి జన్‌కు సుమారు 8,200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని, రోజుకు నాలుగు లారీల యూరియా అందించినట్లు తెలిపారు. మంగళ వారం కాకినాడ నుండి గజ్వేల్‌కు రైలులో 1400 మెట్రిక్‌టన్నులు నాగార్జున యూరియా వస్తుందని, రైతులు ఇబ్బందిపడాల్సి న అవసరం లేదన్నారు. గజ్వేల్ మార్కెట్ యార్డుకు వివిధ మండలాల నుండి రైతులు యూరియా కోసం వస్తున్నారని అలా రావడంతో యూరియా కొరత ఏర్పడుతుందని అన్నారు. రైతులు ఎకరానికి సగం బస్తా లేదా ఒక బస్తా వాడాలని అధికంగా వాడితే పంట నష్టం జరుగుతుందని సూచించారు. మరో రెండు రోజుల్లో రైతులకు యూరియా అందుబాటులోకి తెచ్చి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.




దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కురుమలు

## జనాభా ప్రాతిపదికాన సీట్లు కేటాయించాలి

### కురుమ సంఘం జిల్లా యువత అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్

**సదాశివపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** జనాభా ప్రతిపధికన కురుమలకు ఎమ్మెల్యే, ఎంపి సీట్లను కేటాయించాల్సి న అవసరం ప్రతి రాజకీయ పార్టీలకు ఉందని కురుమ సంఘం యువత జిల్లా అధ్యక్షులు కొలుకూరు ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కురుమ యువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్బంగా పట్టణంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఒకే మారు 115 శాసన సభ సీట్లకు అభ్యర్థులను ప్రకటించినా అందులో ఏ ఒక్కరు కురుమలు లేకపోవడం విచారకరమని, ఇది కురుమలను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ మరో మారు ఆలోచించి కురుమలకు సీట్లను కేటాయించాలని, ఆయా రాజకీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్, బిఎస్పి తదితర పార్టీలకు జనాభా మేరకు సీట్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సదాశివపేట పట్టణ మల్లికార్జున కురుమ సంఘం అధ్యక్షులు రాంచెందర్, మునిపల్లి మండల కురుమ సంఘం మాజీ అధ్యక్షులు శంకరయ్య, కురుమ యువత జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, నాయకులు బిక్షపతి, విఠల్, పన్నాల రాజు, గూడెం అశోక్, మారేపల్లి మహేందర్, ముత్కని ప్రకాష్, అల్లివాద అరుణ్‌కుమార్, మహేష్, హరి ప్రసాద్, ప్రసాద్, బిర్లా మదు, మ్యాకల వెంకటేష్, గోంగ్లూర్ నర్సింలు, మ్యాకల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పల్లె పల్లెకు మీ ఇంటి ఆడబిడ్డ



కాంగ్రెస్ నేత త్రిష దామోదర్‌ను స్వాగతం పలుకుతున్న ఓన్నాపూర్ గ్రామస్థులు

**చౌటకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని ఎన్నాపూర్, వెంకట్ కిష్టాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు త్రిష దామోదర్ పల్లె పల్లెకు మీ ఇంటి ఆడబిడ్డ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలకు చేరుకున్న త్రిష దామోదర్‌ను గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకులు డప్పు చప్పుళ్ళ మధ్య ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో త్రిష దామోదర్ ఇంటింటికి చేరుకుని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలు, రైతులకు అందించే ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, ఉపాధ్యక్షులు రామగౌడ్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పర్టీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లవి జయరాంరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు మౌలానా, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామస్వామి, బిసి సెల్ అధ్యక్షులు గణేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుధాకర్, శివంపేట సర్పంచ్ రాజారెడ్డి, పల్లవి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసి కిరణ్‌గౌడ్, న్యూ ఓన్నాపూర్‌నాయకులు మొగులయ్య,క్రిష్ణ, శేఖర్, వెంకట కిష్టాపూర్ అధ్యక్షులు ఆందోళన శేఖర్, యూత్ అధ్యక్షులు పల్లె భాస్కర్, వెంకటేశం, సుభాస్, మల్లారెడ్డి, వత్తి రాములు, జమాల్ పాల్గొన్నారు.

## అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

### జేఏసి నాయకుల డిమాండ్

**అల్లాదుర్గం,ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా అల్లాదుర్గం సబ్ డివిజన్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని అల్లా దుర్గం మండల జేఏసి నాయకులు చేపడుతున్న రిలేనిరాహార దీక్షలు సోమవారంతో మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసి నాయకులు బ్రహ్మం మాట్లాడుతూ మెదక్ నుంచి రామాయంపేటకు 15 కిలోమిటర్ల దురాన్ని కలిగి ఉంది. ఆ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినప్పుడు మెదక్ నుంచి అల్లాదుర్గంకు 60 కిలోమీటర్ల దూరం కలిగిన ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు ప్రకటించడంలేదని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి లేని యేడల భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు రామచందర్, రుక్మానాయక్, రమేష్ నాయక్, శ్రీనివాస్, మల్ల య్య, లక్ష్మయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### తొలిమెట్టు తెలుగుపై పరిశీలించిన ఉపాధ్యాయులు

**మునిపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తొలి మెట్టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు భాషపై ఉపాధ్యాయులు సోమవారం మెదక్ డైట్ బాధ్యులు పరిశీలిం చారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను, గ్రంథాలయంలను పరిశీ లించి విద్యార్థులను తెలుగు, ఆంగ్లం, గణితంపై పరిశీలించి విద్యార్థులను అభినందించారు. మండలంలోని ఖమ్మంపల్లితో పాటు చిన్న చెల్మెడ, గార్లపల్లి గ్రామాల్లో డైట్ బాధ్యులు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌పి మంజుల పాల్గొన్నారు.





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

**ఝరాసంగం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రానున్న శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిగా కృషి చేయాల్సి న అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు సూచించారు. మండల కేంద్రమైన ఝరాసంగంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే అందరికి సంక్షేమ పథకాలు అందుతాయని, అందుకు బిఆర్ఎస్ ప్రభుత్వానికి చమరగీతం పాడాల్సి న అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు, చేపట్టే అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు వినీల నరేష్, ఎంపిపి అధ్యక్షులు దేవదాసు, ఉపాధ్యక్షులు మల్లన్న పాటిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, డిసిసి ఉపాధ్యక్షులు ముల్తాని, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, నాయ కులు శంకర్ పాటిల్, ఉమావతి మారుతిరావు పాటిల్, సంగీత గుండప్ప, శకుంతల, నవాజ్‌రెడ్డి, నందప్ప, రాంరెడ్డి, హనుమంత్‌రెడ్డి, రుద్రప్పపాటిల్, బస్వరాజ్ పాటి ల్, సంగ్రామ్ పాటిల్, వీర్‌శెట్టి పాటిల్, శంకర్, పెంటయ్య, మల్‌శెట్టి, రాజ్‌కుమార్, రుద్రయ్య స్వామి, ఉస్మాన్‌సాబ్, మహబూబ్ పటేల్, మాణిక్‌రెడ్డి, షకీల్, విష్ణువర్ధ న్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్‌పాటిల్, సిద్దు పాటిల్, అమృత్, బషెట్టి, శ్రీనివాస్‌రెడ్డి, ఏస ప్ప, గోపాల్‌రెడ్డి, క్మాఉల్ హక్, మోహన్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన మాజీ ప్రజాప్రతినిధులు



బిఆర్ఎస్‌లో చేరిన పర్వతాపూర్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పర్వతాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లన్న, మాజీ ఉప సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు తమ అనుచరులతో (50 మంది) కలిసి సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మాజీ ప్రజాప్రతినిధులను, నాయకులను ఎమ్మెల్యే మాణిక్‌రావు పార్టీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్, ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్ దాసరి మచ్చేందర్, మొగుడంపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బంగారు సురేష్, మాజీ సర్పంచ్ మిత్‌ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కారెక్కారు.

## బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ నాయకులు

### -ఖండువాలు కప్పిన మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్




మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు (100 మంది) సోమవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని చింత ప్రభాకర్ క్యాంప్ కార్యాలంలో బిఆర్ఎస్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ పార్టీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో పని చేసేందుకు కారెక్కినట్లు బిఆర్ఎస్‌లో చేరిన వారు పేర్కొన్నారు.

## మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

**అల్లాదుర్గం,ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని మీసేవ నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం మీసేవ మండల నిర్వహకులు అల్లాదర్గం తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిత్యంసేవలందిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా మీసేవ నిర్వాహకులకు కమిషన్ ఆరోగ్యపరమైన భద్రత ఉచిత విద్యుత్ ఉచిత ఇంటర్నేషనల్ సుదపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మూడు మీసేవ కేంద్రాల నిర్వాహకులు చారి, ఉమేష్, క్రాంతిలు పాల్గొని మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుఎస్‌పిసి ఉపాధ్యాయులు

## చలో హైద్రాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

**మనూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సెప్టెంబరు 1వ తారీఖున హైద్రాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నా గోడ పత్రికను మండల కేంద్రమైన మనూర్‌లోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుఎస్‌పిసి నాయకులు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ పెన్షన్ విద్రోహ దినం అయిన సెప్టెంబర్ 1న సమస్యల సాధన ఉద్యమంకు నడుం బిగించినట్లు పేర్కొన్నారు. జులై 1 నుంచి కొత్త పిఆర్‌సి ని కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాల్సి ఉందన్నారు. సిసిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఎస్‌పియు ఉపాధ్యాయులు కంబాపురం అశోక్, అక్కం పాండురంగారెడ్డి, గడీల కిషన్‌రావు, కాశీనాథ్ జాదవ్, కిషన్ నాయక్, పి రాజశేఖర్, రవీందర్‌కుమార్, పొట్టి భూమయ్య, బాబు నాయక్, యండి వశీం, ఏషప్ప, నర్సింలు, రాజశేఖర్, మహిళా నాయకులు శశికళ, పెంటమ్మ, స్వరూప, మంజుల తదితరులు పాల్గొన్నారు.

### అల్మాయిపేటలో వ్యవసాయ విద్యార్థుల సోషల్ మ్యాపింగ్



అల్మాయిపేటలో సోషల్ మ్యాపింగ్ చేపట్టిన వ్యవసాయ విద్యార్థులు

**జోగిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్మాయిపేట గ్రామంలో వ్యవసాయ విద్యార్థుల ద్వారా సోషల్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారంనాడు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయ విద్యార్థులు, సంగుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం కార్యక్రమంలో భాగంగా సోషల్ మ్యాపింగ్ చేపట్టారు. ఇందులో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఊరిలో ఉన్న వనరులు, సమస్యల గురించి గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువాకకేంద్రం కోఆర్డినేటర్ సునీత, అల్మాయిపేట సర్పంచు రవిశంకర్, ఏవో విజయరత్న, వ్యవసాయ విద్యార్థులు నరేష్. శశిధర్, సాయి చరన్,అనూప్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో చోదకులకు పోలీసుల సూచనలు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను తోలాలని పట్టణ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ యం రమణకుమార్ సూచనల మేరకు డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పట్టణంలోని వైఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఆటో డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం అయి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్బంగా ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో పెట్టుకోవాలని, డ్రైవింగ్ లైసెన్సును దగ్గర ఉంచుకోవాలన్నారు. యూనిఫామ్‌ను ధరించి ఆటోను తోలాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే కలిగే ప్రయోజ నాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోల్లో ప్రయాణీకులు విలువైన వస్తువులు మరిచిపోయి దిగిపోతే స్థానిక పోలీసు ఠాణాలో అప్పగించి నిజాయితీని చాటుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

### ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించిన కౌన్సిలర్

**నర్సాపూర్, ఆగస్టు 28.ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డు సునీతారెడ్డి కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల మీద నుండి విద్యుత్ తీగులు ఉండి ప్రమాదకరంగా మారాయి. వాటిని తొలిగించాలని కాలనీ వాసులు అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కాగా రెండవ వార్డు కౌన్సిలర్ లత రమేశ్‌యాదవ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా వెంటనే స్పందించిన కౌన్సిలర్ లత రమేశ్‌యాదవ్ ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకొని,సోమవారం ఉదయం నుండి ఇళ్లకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగెలను తన స్వంత ఖర్చుతో తొలించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ళ పై నుండి ప్రమాదకరంగా మారిన విద్యుత్‌తీగెలను తన స్వంత ఖర్చుతో తొలిగించినందులకు ఆ వార్డు కాలనీ ప్రజలు కౌన్సిలర్ లతరమేశ్‌యాదవ్ ను అభినందించారు.

## సభ్యత్వ నమోదలో పిఆర్‌టియు ముందంజ



పిఆర్‌టియు సభ్యత్వం అందజేస్తున్న ఊడెం వేమారెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలంలో పిఆర్‌టియు 2023 సంవత్సరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పిఆర్‌టియు మం డల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగుళ్ళ లింగంగౌడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సభ్యత్వ నమోదులో పిఆర్‌టియు సంఘం ముందంజలో ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులకు మధ్యంతర భృతితో కూడిన పిఆర్‌సిని పిఆర్‌టియు సంఘం సాధిస్తుందన్నారు. హెల్త్ కార్డు ఇప్పించడంలో సంఘం ముఖ్యపాత్ర వహిస్తుందని తెలిపారు. ఈ సంద ర్భంగా బూర్గుపల్లి, ధర్మారెడ్డిపల్లి, ప్రజ్ఞాపూర్, కొడకండ్ల, రిమ్మనగూడ, శ్రీగిరిపల్లి, అక్కారం, జాలిగామ, పిడిచెడ్, బెజుగామ, అహ్మదీపూర్, కొల్గూరు, సింగాటం పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, హన్మంతరెడ్డి, కనకరాములు, శ్రీనివాస్, పోచయ్యగౌడ్, శ్రీనివాస్‌రావు, భాస్కర్, సత్యనారాయణరెడ్డి, నాగరాజు, వెంకటేష్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, వేణు, చంద్రశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

### పిబిసి ఎడ్యుకేషన్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రారంభం

విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే భారతీయ విద్యా ర్థులకు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యమని సినిబస్టర్ మ్యాగజైన్ యజమాని రోనీ రోడ్రిగ్స్ తెలిపారు. పిబిసి ఎడ్యుకేషన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ని ముంబైలోని జేడబ్ల్యు మారియట్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి నిర్మాత ధీరజ్ కుమార్, నటుడు దర్శన్‌కుమార్, నటినైరా బెనర్జీ హాజరయ్యారు.